నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి 1

శనివారం 21 జనవరి 2023

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భిక్కనూర్

బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, బీసీ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు సాప శివరాములుతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. అంతకుముందు నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎమ్మార్వో ప్రేమ్‌కుమార్‌ను బీసీ సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మారోజ్ మెహనా చారి, రామేశ్వర్‌పల్లి గ్రామ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రంజిత్ కుమార్, ఉపాధ్యక్షులు రాజస్వామి, కోశాధికారి వెంకటేష్, డైరెక్టర్ నర్సింలు, పుట్టకొక్కుల బాలరాజు, కొప్పుల శ్రీనివాస్, మధు, బాల్ లింగం, మల్లేష్, బీసీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాచిన సారా పట్టివేత

- వ్యక్తిపై కేసునమోదు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గుండూరు గ్రామం కర్ణాటక సరిహద్దు వద్ద అక్రమంగా కాచీన సారా నాలుగు లీటర్లు పట్టుకున్నట్టు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం పక్కరాష్ట్రానికి చెందిన జాదవ్ కిషన్ జయరాం తెలంగాణలోని గుండూర్ చౌరస్తా వద్ద విడిగా సారాయి అమ్ముతుండగా పక్కా సమాచారం మేరకు ఎక్సైజ్ సిబ్బంది తనీఖీలు చేపట్టగా ఓ వ్యక్తి సంచి నుంచి నాలుగు ప్లాస్టిక్ లీటర్ బాటీళ్ల పట్టుకున్నారు. వ్యక్తిని అదుపులోకి తీసుకోగా.. మహారాష్ట్రలోని మానుర్ గ్రామం మోతీరాం తాండా, దెగ్లూర్ తాలుకా నివాసిగా తేలింది. కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్టు సీఐ సత్యనారాయణ తెలిపారు.

కొండం చెరువు పనులను ఆపాలి

- భూనిర్వాసితుల ఆందోళన

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో కొండం చెరువు దగ్గర గల కాళేశ్వరం ప్రాజెక్టులోని 21, 22 ప్యాకేజీలో భాగమైన మంచిప్ప కొండం చెరువు 3.5 టీఎంసీ రీడిజైన్ రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కాళేశ్వరం కొండెం చెరువు రిజర్వాయర్ ముంపు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచిప్ప బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా పనుల వద్దకు వెళ్లి.. అక్కడున్న ఇరిగేషన్ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వీరికి ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శంకర్, తూర్పు రాజేశ్ మాట్లాడారు.. మంచిప్ప, అమ్రాబాద్, బైరాపూర్ గ్రామంలోని ప్రజలకు, 2008లో ప్రాణహిత చేవెళ్ల 0.375 టీఎంసీ ప్రాజెక్టు నిర్మాణం వలన ఆ గ్రామంలో వ్యవసాయ భూములు, అటవీ భూములు ఎలాంటి ముప్పు లేదని ఆనాటి ప్రభుత్వం అధికారికంగా చెప్పడం వలన నిర్మాణానికి 150 ఎకరాలు ఇచ్చి సహకరించామని, కానీ ప్రస్తుత టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి ప్రాజెక్టును రీడిజైన్ చేసి సామర్థ్యానికి మించి 3.5 టీఎంసీలుగా మార్చడం వలన మూడు గ్రామపంచాయతీలో ఉన్న పదివేల జనాభా 1200 ఎకరాల వ్యవసాయ భూమి, 800 ఎకరాల అటవీ భూమిని కోల్పోతున్నామని, అందుకే ఈ డిజైన్ ప్రాజెక్టును 2015 నుంచి అడ్డుకుంటున్నామని తెలిపారు. 2022 జనవరి నుంచి రీ డిజైన్ 3.5 టీఎంసీ ప్రాజెక్టు పనుల విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వనందున కాళేశ్వరం 21 ప్యాకేజ్ 3.5 టీఎంసీ రీడిజైన్ రద్దు చేయాలని, అలాగే అధికారికంగా ప్రకటన వచ్చేవరకు ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని వారు తెలిపారు.


ఆందోళన చేస్తున్న భూనిర్వాసితులు.. మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులు

అరెస్టు..

పోలీసులు ముందస్తుగా కొండం చెరువు రిజర్వాయర్ ముంపుగ్రామాల అధ్యక్షుడు గొల్ల శ్రీనివాస్ యాదవ్‌ను అరెస్టు చేశారు. దీంతో ఆయన అరెస్టును పలువురు ఖండించారు. కార్యక్రమంలో సాయగౌడ్, దేవ శంకర్, రాజేష్ పాల్గొన్నారు.

మంచిప్ప భూ నిర్వాసితుల పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతు..

మంచిప్ప రిజర్వాయర్ కొండం చెరువు 21వ ప్యాకేజీ పనులను నిలిపివేయాలని చేపట్టిన భూనిర్వాసితుల పోరాటానికి సీపీఐ(ఎం) నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ రమేష్‌బాబు, నాయకులు పెద్ది వెంకట్ రాములు మాట్లాడుతూ.. రీడిజైనింగ్ మూలంగా అదనంగా రైతులకు ప్రయోజనం కలగకపోగా రైతులు తమ భూములను కోల్పోయి నిరాశ్రయులుగా మారే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఫలితంగా పేదలు కూలీలకు కూడా ఉపాధి అవకాశం దెబ్బతింటుందని అందువల్ల పాత డిజైన్‌ను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

మాస్టర్ ప్లాన్ రద్దు..

రైతుల విజయం

- రైతుల ఐక్య కార్యచరణ కమిటీ
- టపాకాయలు కాల్చి సంబురాలు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

మాస్టర్ ప్లాన్ రద్దు.. రైతుల విజయమని రైతుల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తున్నట్టు మున్సిపల్ శాఖ ప్రధాన అధికారి అరవింద్ కుమార్ ప్రకటించడంతో శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అడ్లూరు గ్రామంలో రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 45 రోజులు పైగా ఎనిమిది గ్రామాల రైతులు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు ఏకతాటిపైకి వచ్చి ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. మాస్టర్ పాన్ రద్దు కోసం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపినందుకు, మాస్టర్ ప్లాన్ రద్దు కోసం ఏకగ్రీవ తీర్మానం చేసిన టీఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత 45 రోజుల పైగా రైతుల ఉద్యమంతో మాస్టర్ ప్లాన్ రద్దు చేయడం ఇది రైతుల విజయమని తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో, నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఢిల్లీలో ఉద్యమ పోరాట స్ఫూర్తితో ఉద్యమం ప్రారంభించామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ రద్దు పట్ల రైతులు టపాయకాలు కాల్చి సంబురాలు చేసుకున్నారు.


మాట్లాడుతున్న ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు



ఎఫ్ఐఆర్ తప్పుగా నమోదు చేశారని

- పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన బాలయ్య ఈ నెల 15వ తేదీ ఆదివారం భిక్కనూర్ నుంచి అంతంపల్లి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతూ స్థానిక టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో మృతి చెందాడు. దీంతో పోలీసులు సీసీ ఫుటేజ్ పరిశీలించి బాలయ్య లారీని వెనుక నుంచి ఢీకొట్టి మృతి చెందాడని నిర్ధారించారు. కానీ బాలయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం ఎఫ్ఐఆర్‌లో రోడ్డుపైన నిలిపిన లారీపై ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదని ఆరోపిస్తూ పెద్ద సంఖ్యలో బాలయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఆనంద్‌గౌడ్ గ్రామస్తులకు చట్ట ప్రకారం కేసు నమోదు చేశామని వివరించారు. దీంతో ఆందోళనకారులు తమ ఆందోళనను విరమించారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పోగు సాయిబాబా (32) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్టు లింగంపేట ఎస్సై శంకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లింగంపల్లి గ్రామానికి చెందిన పోగు సాయిబాబా 12 సంవత్సరాల క్రితం మెదక్ జిల్లా కొండపాక నుంచి లింగంపల్లికి ఇల్లరికం వచ్చాడు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉన్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. సాయిబాబా తాగుడుకు బానిసై ఇంట్లో గొడవ పడడంతో పలుసార్లు నచ్చజెప్పినా ఫలితం లేకుండా పోయింది. గురువారం ఉదయం ఇంట్లో గొడవపడి మందు తాగడానికి డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పోగు సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎత్తొండలో ట్రాక్టర్ దగ్ధం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఏత్తొండ, యాదవ్‌పూర్ వెళ్లేదారిలో నిలిపిఉంచిన ట్రాక్టర్ దగ్ధమైంది. ట్రాక్టర్ యజమాని గురువారం రాత్రి పొలం పనులు ముగించుకొని మరుసటి రోజు పొలం పనులు నిమిత్తం ట్రాక్టర్ అక్కడే ఉంచగా.. శుక్రవారం తెల్లవారు జామున వెళ్లి చూసేసరికి దగ్ధమై ఉంది. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్, ప్రింటర్ చోరీ

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్, ప్రింటర్‌లు చోరికి గురైనట్టు కళాశాల ప్రన్సిపాల్ అరవింద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రన్సిపాల్ మాట్లాడుతు.. సంక్రాంతి సెలవులు పూర్తికాగానే మరుసటి రోజు గురువారం కళాశాలకు వచ్చి చూడగా.. రెండు కంప్యూటర్, రెండు ప్రింటర్‌లు సుమారుగా ఒక లక్ష విలువైన వస్తువులు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారని తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ ఇసుక తరలింపు

నవతెలంగాణ-జుక్కల్

ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక పక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. శుక్రవారం ఆరు లారీల నిండ అనుమతి పత్రాలు లేకుండా అక్రమ ఇసుకను కర్ణాటక సరిహద్దు దాటించేందుకు ప్రయత్నిస్తున్న ఆరు లారీలను జుక్కల్ తహసీల్దార్ గణేష్ ఆదేశాలతో ఆర్ఐ రామ్‌పటేల్ పట్టుకొని జుక్కల్ రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఆరు లారీలకు కలిపి ఒక లక్ష ముప్పై వేలు జరిమానా వేసి వదిలేశారు. ఓవర్ లోడ్ తో వెళ్తున్న సంబంధిత ఆర్టీఏ శాఖకు తెలియచేయాల్సిన ఎమ్మార్వో సమాచారం ఇవ్వకుండా జరిమానా వేసి పంపించి వేయడం పలు అనుమానాలకు తావిస్తోందని మండల వాసులు ఆరోపిస్తున్నారు.

మూడెకరాల భూమిని ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

భూమిలేని రైతులకు మూడు ఎకరాల భూమిని ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని మాతూసంఘం గ్రామంలో జరిగిన భూపోరాట కమిటీ రైతుల సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. మాతూ సంఘం గ్రామంలో భూమిలేని పేద రైతులు సుమారుగా 200 మంది ఉన్నారని గ్రామ శివారులో ప్రభుత్వ రెవెన్యూ ల్యాండ్ సుమారుగా 300 ఎకరాల భూమి పడావుగా ఉంటుందని ఇలాంటి భూములను వ్యవసాయం చేసుకునే పేద రైతులకు పంచాలనీ అన్నారు. ఈ భూమిపై గత నాలుగు నెలలుగా మండల తహసీల్దార్‌కు దరఖాస్తులు పెట్టుకున్నారని, భూమిని సర్వే చేసి ఈ భూమి రెవెన్యూ భూమి అని తేల్చారని, ఈ భూమికి పేదలకు పట్టాలు ఇస్తామని చెప్పారని తెలిపారు. కానీ పేదలకు మాత్రం ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని వివరించారు. గ్రామంలో ఉన్న 119 175 సర్వేనెంబర్‌లో గల 150 ఎకరాల భూమిని భూమిలేని పేద రైతులకు వ్యవసాయం చేసుకోవడానికి పంచి పెట్టాలని లేనిచో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భూమిని చదును చేసుకొని పంటలు వేయాలని డిమాండ్ చేశారు. అలాగే భూమిపై పేద రైతులు వెళ్లి గిరిజన సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో భూమిపై జెండాలు పాతారు. ఈ భూమిపై వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి రైతులకు భూమి ఇవ్వాలని, సీపీఐ(ఎం), ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యేకు, అదేవిధంగా జిల్లా కలెక్టర్‌కు తీసుకువెళ్తామని అన్నారు. పేద రైతులకు న్యాయం జరిగేంతవరకూ పోరాటాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ప్రకాష్, కమ్మరి సాయిలు, రైతు సంఘం నాయకులు మల్లేష్, మధు, సరిత 100 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

తెలంగాణలో అభివృద్ధి.. సంక్షేమం

- ఎమ్మెల్యే జాజాల సురేందర్


చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి.. సంక్షేమం చేపడుతున్నామని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మారుతి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధబలరాం, జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఏఎంసీ చైర్మన్ సత్యం రావు, డీసీసీబీ, డీసీయంయస్ డైరెక్టర్ సాయికుమార్, గాంధారి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఏయంసీ వైస్ చైర్మన్ రెడ్డి రాజులు, ఉప సర్పంచ్ రమేష్, బీఆర్‌యస్ మండల అధ్యక్షులు శివాజీ రావు, బీఆర్ఎస్ యస్.సీ సెల్ మండలాధ్యక్షులు జువ్వాడి వినయ్‌కుమార్, తహసీల్దారు గోవర్ధన్, ఎంపీటీసీలు, వివిధ గ్రామ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, గ్రామ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటలపై శ్రద్ధకనబర్చాలి

- జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-పిట్లం

రైతులు యాసంగి సీజన్లో చిరుధాన్యాల పంటలపై శ్రద్ధ కనబరచాలని జిల్లా వ్యవసాయాధికారిని భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చిరుధాన్యాలపై వ్యవసాయ శాఖ, రిలయన్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. యాసంగి సీజన్లో రైతులు జొన్నలు, రాగులు, సజ్జలు, కొర్రలు మండల వ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం పెంపొందించాలని, ఖర్చుతో ఎక్కువ లాభాల ధాన్యాల పంటలు పండించి అధిక దిగుబడులు పొందాలని అన్నారు. చిరుధాన్యాలతో ప్రోటీన్స్, న్యూట్రిన్స్, మెలటిన్ వల్ల ప్రజలు ఆరోగ్యమే కాకుండా, రోగనిరోధక శక్తి పెంపొందించుటకు కృషి చేస్తాయని ఆమె సూచించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, నర్సాగౌడ్, బాన్సువాడ, బిచ్కుంద ఏడీఏలతోపాటు, మండల వ్యవసాయ అధికారి కిషన్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రైతులు, అధికారులు

చదువుతో పాటు ఆటలూ అవసరం

- ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్ట్ మండల పర్యవేక్షకురాలు వినోద

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు ప్రస్తుత రోజుల్లో చదువు తప్పనిసరి అవసరమని ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్ట్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు వినోద అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో శుక్రవారం భేటీ బచావో బేటి పడావో వారోత్సవాలలో భాగంగా అంగన్వాడీ ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, బాలికలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో బాలికలకు చదువుతోపాటు ఆటపాటలు కూడా అవసరమన్నారు. ఎడపల్లి మండల వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, సరంచ్‌ల సమైక్య రాష్ట్ర సంయుక్త కార్యదర్శి స్థానిక సర్పంచ్ అమానుల్లా షరీఫ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలోని బాల బాలికల కొరకు నాణ్యమైన విద్య బోధన్ అందించేందుకు ఉపాధ్యాయులను నియమిస్తుందని అన్నారు. ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజన పథకం తోపాటు బాల బాలికలకు ఉపకార వేతనాల ను సైతం ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు.


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

దేశీదారు రవాణా కాకుండా కఠిన చర్యలు చేపడతాం

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

నవతెలంగాణ-బోధన్

మహారాష్ట్ర నుంచి తెలంగాణ ప్రాంతంలో తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని పూర్తిగా అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన వాహనాల వేలంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన 15 వాహనాలను వేలం వేసినట్టు తెలిపారు. ఈ వాహనాలను వేలం వేయగా లక్షా 5480 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ డబ్బులను ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్టు తెలిపారు. బోధన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 10 మండలాలు ఉండగా రెంజల్, సాలూర, పోతంగల్ మండలాలు మహారాష్ట్ర సరిహద్దున ఉన్నాయని, దాంతో మహారాష్ట్ర నుంచి దేశీదారు మద్యం రవాణా జరుగుతుందని అన్నారు. దేశీదారు నివారణకు డిటిఎఫ్, ఎన్ఫోర్స్మెంట్ నాలుగు టీంలను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా వేస్తూ పట్టుకుంటున్నామని తెలిపారు. మహారాష్ట్ర మద్యాన్ని అరికట్టి తెలంగాణ మద్యం విక్రయాలు పెరిగేలా చూస్తున్నామని తెలిపారు. బోధన్ సర్కిల్లో నాటుసార తయారీ పూర్తిగా అరికట్టామని ఆయన తెలిపారు. అనంతరం వాహనాల వేలంలో వాహనాలు పొందిన వారికి ఆయన సంబంధిత వాహనాల పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్, ఎస్ఐ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాల పత్రాలను అందజేస్తున్న మల్లారెడ్డి

కంటి వెలుగును సందర్శించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలోని కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. కంటి చూపు పరీక్షను నిర్వహించుకొని కంటి వెలుగు కార్యక్రమం ఏ విధంగా నడుస్తుందని అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కంటి వెలుగు పరీక్షలు సక్రమంగా చేస్తూ విధిగా నిర్వర్తించాలని సిబ్బందికి తెలిపారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలో గల 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సంకీర్త్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.



సోషల్ వర్క్ భాగంలో పీహెచ్‌డీ విద్యార్థులకు అవగాహనా సదస్సు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని దక్షిణ ప్రాంగణంలో 2022-23 సంవత్సరానికి, డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగంలో నూతనంగా అడ్మిషన్ పొందిన పీహెచ్డీ స్కాలర్స్‌కి అవగాహన సదస్సును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ విద్యావర్ధిని హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలో మంచి అవగాహన కల్పించుకుని ఉన్నతమైన పరిశోధనలు చేసి మంచి భవిష్యత్తును పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ వీరభద్రం, బోర్డు ఆఫ్ స్టడీస్ డాక్టర్ అంజయ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ యాలాద్రి, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సుధాకర్ గౌడ్, డాక్టర్ మోహన్ బాబు, నారాయణ, దిలీప్, అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ డాక్టర్ యాలాద్రి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ముడవ శనివారం నిజామాబాద్ నగరంలో విద్యుత్ సబ్ స్టేషన్ ల్లో నెలవారి మరమ్మత్తుల కారణంగా ఉప కేంద్రాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడిఈ టౌన్ 1,2,3 చంద్రశేఖర్, తోట రాజశేఖర్, విరేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. తిలక్ గార్డెన్, న్యూ హౌసింగ్ బోర్డ్, వినాయక్ నగర్, సుభాష్ నగర్, గూపన్ పల్లి, అర్సపల్లి విద్యుత్ ఉప కేంద్రాలు (సబ్‌స్టేషన్) లలో మరమ్మతులు నిర్వహించడం జరుగుతుంది విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

కృష్ణవేణి పాఠశాలలో క్రీడాపోటీలు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్



బాల్కొండ మండలకేంద్రంలోని కృష్ణవేణి హైస్కూల్లో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులకు క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ క్రీడాజ్యోతి వెలిగించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కబడ్డీ, ఖోఖో వాలీబాల్ ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భానుచందర్, ఆకుల లక్ష్మణ్, రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలు బహిష్కరణ..?

- ఇందుకు కారణం గౌడ సంఘానికి చెందిన పెద్దలే..?

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని గౌడ సంఘంలో రెండు నెలలుగా రెండు కుటుంబాలు నరకయాతన పడుతున్నాయి. ఇందుకు కారణం సంఘానికి చెందిన కొందరు పెద్దలేనని ఆరెండు కుటుంబాలు బహిరంగంగానే చెపుతున్నారు. అంత సంఘ బాగోగులకు మాట్లాడినమే తప్ప తామెవరికి ఇబ్బందులకు గురి చెయ్యలేదని సంఘం సభ్యులు వాదిస్తున్నప్పటికీ వారి చేష్టలు మరోలా ఉన్నాయని బాధిత కుటుంబాలు మొరపెట్టు కుంటున్నాయి. ఆరెండు కుటుంబాలు సంఘంలో జరిగే కొందరి అరాచకాలను ఎండగట్టినందుకు కక్ష సాధింపు చర్యల్లో భాగంగా సంఘాన్ని అడ్డం పెట్టుకొని తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ ఇబ్బందులకు గురిచేయడంతో బాధితులు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. దీంతో మరింత కక్ష సాధింపుకోసం వారితో



సంఘ సభ్యులు మాట్లాడకుండా, వారి ఇండ్లల్లో శుభ కార్యాలకు రాకుండా చేశారని ఆరెండు కుటుంబాలు ఆవేదనతో కుమిలి పోతున్నట్లు తెలిసింది. అధికారులు స్పందించి సంఘం సమస్యలపై విచారణ చేసి త్వరగా సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చూడాలని పలువురు గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. మరోపక్క సంఘంలోని కొందరు వీరిపై లేనిపోనివి సృష్టించి అధికారులకు తప్పుదోవ పట్టించి ఆరెండు కుటుంబాలకు సంఘం నుండి సభ్యత్వం నుండి తొలగించే పన్నాగం పన్నుతున్నారని సమాచారం. అధికారులు స్పష్టమైన సమాచారం సేకరించి న్యాయం చెయ్యాలని బాధితుల తరపున కొందరు సంఘ సభ్యులు కోరుతున్నారు. సంఘం డబ్బులతో కొందరు జల్సాలు చేస్తూ కక్షలు పెంచి సంఘ సభ్యులను వాడుకుంటు న్నారని తెలిసింది. బాధితుల చుట్టాలకు సైతం విడదీస్తున్నారని సంఘంలోని కొందరు పేరు చెప్పని సంఘ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ఏదేమైనప్పటికీ అధికారులు స్పందించి ఇరువురిని కూర్చుండబెట్టి రాజీ కుదిర్చి సంఘాన్ని ఒకటిగా చేసి ఆదుకోవాలని కొందరు సంఘ సభ్యులు వేడుకుంటు న్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జక్రాన్‌పల్లికి చెందిన చెలిమెల దీపిక భర్త అరుణ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.28వేల చెక్కును ఎమ్మెల్సీ విజి గౌడ్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాట్పల్లి నర్సారెడ్డి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం హన్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుడు ప్రకాష్‌రావుపై కేసునమోదు కావడంతో ఆయనపై విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. బ్యాంకు రుణం విషయంలో జరిగిన గొడవ నేపథ్యంలో మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిజామాబాద్ మూడో టౌన్లో కేసు నమోదైంది. దీనిపై ఎంఈఓ రామారావు ఇచ్చిన విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు.

రథం తయారికి రూ. 50వేలు విరాళం



విరాళం అందజేస్తున్న ఎన్నారై

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి సంబంధించి నూతన రథం తయారీకి మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన ఎన్నారై గోగులావత్ సుధాకర్ రూ.యాభై వేల విరాళం అందించారు. తన చిన్న కుమారుడు కేశవ పుట్టినరోజు సందర్భంగా నూతన రథం తయారీకి ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు విరాళం మొత్తాన్ని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం రాజేష్ కు అందజేశారు. ఆయనకు గ్రామ సంఘం పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోగులవత్ సుధాకర్ కుటుంబ సభ్యులు గోగులావత్ పద్మజ, గోగులావత్ ఉత్తమ్, బాబూలాల్ దేవాయి, ధరం సోత్ మోహన్ నాయక్, గ్రామ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు కౌడ నరసయ్య, క్యాషియర్ భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి అంకిత్, సలహాదారులు చింత గణేష్, కమిటీ సభ్యులు పవర్ సంతోష్, జగదీశ్వర్, రోహిత్, కరిపే రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన ఉప సర్పంచ్ ఫోరం సభ్యులు



బాజిరెడ్డికి బొకేను అందజేస్తున్న ఉపసర్పంచులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో డిచ్‌పల్లి ఉప సర్పంచుల ఫోరం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల విషయమై చర్చించామని ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు లక్కం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురసాని నవీన్ రెడ్డి తెలిపారు. దీనికి ఆయన సానుకులంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రంజిత్, ఉపాధ్యక్షులు రాజలింగం, బుచ్చమ్మ, క్యాషియర్ భరత్, ఆరేపల్లి ఉపసర్పంచ్ రాము, మిట్టపల్లి ఉపసర్పంచ్ కిషన్, బీబీపూర్ ఉపసర్పంచ్‌తోపాటు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

రాష్ట్రస్థాయి కథల పుస్తకంలో తడపాకల్ విద్యార్థుల కథలు

నవతెలంగాణ-ఏర్గట్ల

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్ విద్యార్థులు రాసిన కథలు రాష్ట్రస్థాయి తెలంగాణ బడి పిల్లల కథల పుస్తకంలో మరోసారి దర్శనమిచ్చాయి. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ...రంగినేని సుజాత మోహన్ రావు ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సిరిసిల్ల వారు గత సంవత్సరం తెలంగాణ వ్యాప్తంగా బడి పిల్లలు రాసిన కథలను స్వీకరించారని తెలిపారు. అందులో మంచి సందేశం తో కూడిన కథలను ఎన్నుకొని వాటితో కథల చెట్టు పుస్తకాన్ని ప్రచురించారని తెలిపారు. ఇందులో తడపాకల్ పాఠశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థుల్లో.. రోషిణి రాసిన నిస్వార్థ సేవ, అభినయ్ దురాశ కథ, అభిలాష్ పెద్ద వేప చెట్టు, హన్సిక పర్యావరణ పరిరక్షణ, గ్రీష్మ రాసిన మిత్రలాభం, సమీనా రాసిన తెలివైన ఏనుగు కథలు ప్రచురితమయ్యా యన్నారు. ఈ కథల కోసం గంగాదేవి వేసిన అందమైన బొమ్మలు కతల పుస్తకంలో చోటు సంపాదించుకున్నాయని



తమ కథలు వచ్చి పుస్తకంతో తడ్‌పాకల్ విద్యార్థులు

తెలిపారు. వీరికి త్వరలోనే ప్రశంస పత్రాలను నగదు బహుమతిని అందజేస్తారని తెలిపారు. కథల పుస్తకంలో చోటు సంపాదించుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు రవీందర్, నాగప్ప, కృష్ణప్రసాద్, గంగాధర్ అభినందించారు.

అంతర్జాతీయ అండర్ ఆర్మ్ క్రికెట్ పోటీలకు విజయ్ హైస్కూల్ విద్యార్థులు



పోటీలెకు ఎంపీకైన విద్యార్థులతో అమృతలత, ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అసోసియేషన్ వారు నిర్వహించిన అండర్ ఆర్మ్ క్రికెట్ జాతీయస్థాయి క్రీడలకు మామిడిపల్లి విజయ్ హై స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు విద్యా సంస్థల అధినేత్రి డాక్టర్ అమృతలత, ప్రథమ ఉపాధ్యాయురాలు టి కవిత, దివాకర్ శుక్రవారం తెలిపారు. పంజాబ్ రాష్ట్రంలోని మొనాలిలో నిర్వహించిన జాతీయస్థాయి క్రీడా ఎంపికలో బాలుర విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి శివ కౌశిక్, బాలికల విభాగంలో పదవ తరగతి విద్యార్థిని మోహన సాయి ప్రియ అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారని చెప్పారు. వీరు నేపాల్ లోని పోకర్‌లో ఈనెల 23 నుంచి 24 వరకు జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మెళకువలు నేర్పిన వ్యాయామ ఉపాధ్యాయులు ధర్మపురిని అభినందించారు. కార్యక్రమంలో ప్రైమరీ పాఠశాల ఇంచార్జ్ ఎస్తేరు రాణి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

నవతెలంగాణ-మోపాల్/ముప్కాల్

మోపాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శ్రీ క్యాతం రవి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సమస్య, సబ్‌కా వికాస్, సబ్‌కా యోజన ఫెసిలిటరీ, ఆరోగ్యం, విద్య, కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ, పంచాయతీ ఆదాయ వ్యయం లెక్కలను వినిపించారు. గ్రామపౌరులు, ప్రజల సహకారంతో గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ ముత్యన్న, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు

రెంజర్లలో..

ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలో సర్పంచ్ ఆకుల రాజేశ్వర్ అధ్యక్షతన గ్రామసభ చేపట్టారు. గ్రామంలో కంటి రోగులను గుర్తించి కంటి వైద్య శిబిరంలో కంటి చికిత్సలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆశ వర్కర్లకు దిశ నిర్దేశించారు. గ్రామస్తులు సైతం సహకరించాలని కోరారు. గ్రామస్తులు దీన్ని సద్వినియోగం చేసుకుని కంటి వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, హెల్త్ సిబ్బంది, వార్డ్ సభ్యులు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల దేశానికి గర్వకారణం

ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/నిజామాబాద్‌సిటీ

ఆడపిల్ల దేశానికే గర్వ కారణమని, ఆడపిల్లను చూడగానే మాతృత్వం గుర్తుకు వస్తుందని, మేకలకు, గేదెలకు ఆడపిల్ల పుడితే సంబరాలు చేసుకుంటాం కాని మనకు ఆడబిడ్డ పుడితే మాత్రం ఏడుస్తామని, ఇంకా ఎన్నాళ్ళు ఇలా ఏడువడంలోనే గడపాలని ఇకనైనా మారుదామని ఐసీడీఎస్ సూపర్వైజర్లు సరిత, బుజ్జి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఘన్ పూర్,లింగ సముద్రంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడ పిల్లలను చదవనిద్దాం.. ఎదగనిద్దాం.. పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. అని పిలుపునిచ్చారు. లింగవివక్ష, ఆడ పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, వ్యక్తి గత పరిశుభ్రత, అమ్మాయిలు తమను తాము ఎలా రక్షించుకోవాలనే దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సౌజన్య, హెచ్ఎం కోటీశ్వర్‌రావు, శారద, నుస్రత్, జ్యోతి, సవిత, సౌజన్యసర్పంచ్ అరుగుల వినోద, అంగన్వాడి టీచర్ లక్ష్మి, ఆశ కార్యకర్త, అధ్యాపక బృందం, పిల్లల తల్లి తండ్రులు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు

నిజామాబాద్ సిటీ:బాలికలకు బాల్య వివాహాలు చేయకూడదని సీడీపీవో సుపర్వైజర్ నందిని, సఖీసెంటర్ అడ్మిన్ లావణ్య అన్నారు. జాతీయ బాలికా వారోత్సవాల సందర్భంగా కంఠేశ్వర్ లోని పాలిటెక్నిక్ బాలికల కళాశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ



నిజామాబాద్‌సిటీ : పాలిటెక్నిక్ కళాశాలలో..

సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక ఆహారం, విద్య ప్రాధాన్యత అంశాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల విద్యార్థులు బాలికలతో ప్రతిజ్ఞ చేయించి సంతకాల సేకరణ నిర్వహించారు, లింగ వివక్ష, అక్రమ రవాణా, ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాలు గురించి వివరించారు. బాలికలకు అనుకోకుండా జరిగే అఘాయిత్యాలకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ గురించి కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరేష్, శివరాజ్ లెక్చరర్, అంగన్వాడి టీచర్స్ అనిత, దీపిక, రమ పాల్గొన్నారు.

పౌర హక్కుల సంఘం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా 16వ మహాసభ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి అల్గోట్ రవీందర్ మాట్లాడుతూ.. పౌర హక్కుల 16వ ఉమ్మడి నిజామబాద్ జిల్లా మహాసభ ఈ నెల 22 న ప్రెస్ క్లబ్,పాత కలెక్టరేట్ ఎదుట, నిజామాబాద్ లో జరుగుతుందని తెలిపారు. మనిషి జీవించే హక్కు,బావ ప్రకటన స్వేచ్ఛ కొరకు పౌర హక్కుల సంఘం ఏర్పడిందన్నారు. రాజ్యాంగం, చట్టాల ద్వారా మనిషికి సంక్రమించిన హక్కులు ప్రభుత్వాలు గౌరవించడం లేదని, కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్ గా పనిచేస్తూ ప్రజల జీవించే హక్కును, చట్టాలను ప్రభుత్వాలే ఉల్లంఘిస్తుంటే న్యాయస్థానాలు కళ్ళప్పగించి చూస్తున్నాయని పేర్కొన్నారు. సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతు న్నాయని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ కనకయ్య , అసిస్టెంట్ ప్రొఫెసర్ దత్తహరి, పిడియస్ యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.నరేందర్,కర్క గణేష్, పిడిఎస్ యు జిల్లా నాయకులు మహిపాల్, నవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

శనివారం 21న డిచ్‌పల్లి డివిజన్‌లోగల 33/11కేవీ విద్యుత్ కేంద్రం లో 3 వ శనివారం మరమ్మత్తుల దృష్ట్యా 15 విద్యుత్ ఉపకేంద్రాల్లో ఉదయం 11:00 నుండి సాయంత్రం 6:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డిచ్‌పల్లి ఎన్ టి డిసిఎల్ ఎంబిఎ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి, కమలాపూర్, మిట్టపల్లి, రాంపూర్ డి, దూస్‌గం, దమన్నపేట్ మైలారం, రామడుగు, గన్నారం, ఇందల్ వాయి, మిషన్ భగీరథ, ఎల్లారెడ్డిపల్లి, అమ్సన్ పల్లి, సిర్నాపల్లి, గౌరారం పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు సహకరించాలని తెలిపారు. బిల్లులను చెల్లించి సహకరించాలని ఆయన సూచించారు.

కంటికి కాంతినిచ్చే అద్భుత పథకం

కంటి వెలుగుపై అవగాహన కల్పించాలి

ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కంటి వెలుగు కార్యక్రమం ప్రతీ ఇంట్లో చీకటిని తరిమికొట్టి ప్రతీ వ్యక్తి కంటికి కాంతిని ప్రసాదించే అద్భుత పథకమని పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి అభివర్ణించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో శుక్రవారం జీవన్ రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై అధికారులు,ప్రజా ప్రతినిధులతో వీడియో కాల్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

అధికారులు, ప్రజా ప్రతినిధులు కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక్కో బీఆర్ఎస్ కార్యకర్త కనీసం 10మందికి కంటి పరీక్షలు చేయిస్తే కంటి చూపు లేని వారందరికి వెలుగు వస్తుంద న్నారు. సోషల్ మీడియాలో కంటి వెలుగు పథకం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని అన్నారు. నియోజకవర్గంలో పది కేంద్రాలలో కంటి పరీక్షలు జరుగుతున్నా యన్నారు. టార్గెట్ అధిగమించేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని జీవన్ రెడ్డి ఆదేశించారు.

నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఖానాపూర్ గ్రామంలో 27 జూలై 2022లో స్వర్గరథానికి లక్షా69వేలు చెల్లించారు. కానీ ఇప్పటికీ ఖానాపూర్ గ్రామానికి స్వర్గరథం రాకపోగా వాటి నిధులు దుర్వినియోగం చేశారని ఎంపీడీవో కార్యాలయ సూపరింటెంట్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీని వెనుక ఉన్న వారిపై చీటింగ్ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, మండల శాఖ అధ్యక్షులు రోహిత్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, మండల శాఖ ఉపాధ్యక్షులు లక్కారం రాజేందర్, ఖానాపూర్ మూడోవార్డు సభ్యులు, మండల ప్రధాన కార్యదర్శి సుంకరి వినోద్, కృష్ణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

25న తొర్లికొండకు ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్సీ రాక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఈనెల 25న మండలంలోని తొర్లికొండ గ్రామానికి రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ వస్తున్నట్లు సర్పంచ్ సురేష్ తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, సర్పంచ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ రూరల్ ఎంమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి ఆహ్వానించారని తెలిపారు. ఈ నెల 25న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి యానాం నుండి తొర్లికొండ వరకు మంజురైనా డబల్ రోడ్డు శంకుస్థాపన చేయడానికి ఎమ్మెల్యేను ఆహ్వానించామన్నారు. తప్పక వస్తానని



బాజిరెడ్డిని ఆహ్వానించిన వీడీసీ, సర్పంచ్

ఎమ్మెల్యే మాట ఇచ్చారని తెలిపారు అదేవిధంగా రోడ్డు భవనాల శాఖ మాత్యులు ప్రశాంత్ రెడ్డి ని తీసుకురమ్మని కోరగా వెంటనే ఫోన్ చేసి మంత్రి ని ఆహ్వానించగ వస్తానని మాట ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్థిక ప్రణాళికల సభ్యుల, ధర్పల్లి జడ్పీటీసీ జగన్, జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి , హాజరు కానున్నారు, తెలిపారు. కార్యక్రమం లో వీడీసీ అధ్యక్షులు జీవన్, కోశాధికారి జానకిరామ్, సర్పంచ్ సురేష్, ఉపసర్పంచ్ భూమేష్, ఎంపీటీసీ పద్మ, సొసైటీ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షులు రాజమల్లు, టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు శేఖర్‌గౌడ్, యువజన విభాగం నాయకులు సంకెపల్లి ప్రేమ్ పాల్గొన్నారు.

హాకీ జట్టుకు క్రీడా దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తూంపల్లి ఉన్నత పాఠశాల కు చెందిన పదవ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో పాల్గొనే నిజామాబాద్ జిల్లా జట్టుకు క్రీడా దుస్తులు శుక్రవారం పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు శిక్షణ శిబిరం పూర్తయిందని, రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె బాలామణి మల్లేష్, ఎంపీటీసీ లింగం, ప్రధానోపాధ్యాయులు సైరా సత్యం, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేష్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లావణ్య పాల్గొన్నారు.

వరిలో తడిపొడి విధానంపై అవగాహన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పుర్యానాయక్ తండా గ్రామ పంచాయితీ పరిధిలో వరి పంటలో తడి పొడి విధానం గురించి కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ వారి పద్మ పాని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును శుక్రవారం నిర్వహించారు. వరిలో తడి పొడి విధానంలో భాగంగా నీరు పెట్టడం, ఆర పెట్టడం ద్వారా నీటి వినియోగం తగ్గడంతో పాటు నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. సమావేశంలో సర్పంచ్ గేని బాయిబలరాం నాయక్, సొసైటీ వైస్‌చైర్మన్ పీర్‌సింగ్, ఎంపీటీసీ సంగ్య సవిత, రైతు సమన్వయ కమిటీ సభ్యులు బబ్యా నాయక్, ఏఈవో శిరీష, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జలాల్‌పూర్‌లో క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో యువకులు నిర్వహిస్తున్న గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ డీసీసీ డెలిగేట్ రాష్ట్ర మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. క్రీడాకారులతో పరిచయం చేసుకొని క్రీడాకారులను ప్రోత్సహించడానికి టోర్నమెంట్ నిర్వహణ ఖర్చులకు రూ.11వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని క్రీడలు పలు ప్రభుత్వ ఉద్యోగాల పరంగా దృఢత్వానికి ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ సోహైల్, షేక్ హమీద్, రంజిత్ యాదవ్, షేక్ జూనైద్, సాయికుమార్ వర్మ, వెంకట్‌గౌడ్, నరెడ్ల సాయిలు, సుధాకర్, నరేష్, శంషు, జలీల్, డీసీసీ కార్యదర్శి సురేష్ బాబా, మెయినుద్దీన్, రెడ్డి రాంబాబు, జంపాల రామకృష్ణ వివిధ గ్రామాల క్రీడాకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్ మండలంలో పర్యటించిన కేంద్ర బృందం

నవతెలంగాణ-రెంజల్

మండలంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలించేందుకు గానూ కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. మండలంలోని దూపల్లి, కూనేపల్లి, కందకుర్తి గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పింఛన్లు, ఉపాధి హామీ పనులు, అంగన్వాడీ భవనాలు, సీసీ డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో రికార్డులను వారు క్షుణ్ణంగా పరిశీలించారు. సంసాద్ ఆదర్శ గ్రామమైన కందకుర్తి అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. కేంద్ర బృందంలో గంగప్ప ఆధ్వర్యంలో వీటిని పరిశీలించారు. ఆయన వెంట డీఆర్డీఏ అసిస్టెంట్ విజయ్, ఎంపీడీవో శంకర్, సర్పంచులు శనిగరం సాయిరెడ్డి, రోడ్డ విజయ లింగం, మీర్జా కలీం బేగ్, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులకు సంబంధించి ఖాళీల వివరాలను సబ్జెక్టుల వారిగా యాజమాన్యాల వారిగా www.deonizamabad.in web site లో పొందుపరిచామని జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గమనించగలరని కోరారు.

ప్రశాంతంగా పరీక్షలు.. ఒకరు డిబార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం ఉదయం జరిగిన యూజీ 4వ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్ష లో 2465మంది విద్యార్థులకు గాను 2334మంది హాజరయ్యారని, 131మంది గైర్ హాజరు అయ్యారని తెలంగాణ యూనివర్సిటీ పరిక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణా తెలిపారు. బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో 4వ సెమిస్టరు బ్యాక్ లాగ్ వెబ్ టెక్నాలజీ పరీక్ష లో ఒకరు డిబార్ అయ్యారని అన్నారు. మధ్యాహ్నం జరిగిన 3వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్షలలో 4362కి గాను 3918మంది హాజరయ్యారని 444మంది గైర్హాజరయ్యారని ప్రొఫెసర్ అరుణ తెలిపారు.

అలైదా చేగువేరాతో సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బెంగళూరులో జరుగుతున్న సీఐటీయూ అఖిలభారత మహాసభల్లో చేగువేరా కూతురు అలైదా చేగువేరాను సీఐటీయూ నిజామాబాద్‌జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ కలిశారు.

గాయపడ్డ వృద్ధుడు మృతి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని హొన్నాజిపేట్ గ్రామంలో ఇటుక బట్టిలో పనిచేసే కార్మికుడు ట్రాక్టర్‌పైనుంచి పడి మృతిచెందాడు. ఎస్ఐ వంశీకృష్ణరెడ్డి వివరాల ప్రకారం... సీతారాం జాదవ్ (60) ఈనెల 19న సాయంత్రం పనులు ముగించుకొని తన యజమాని ట్రాక్టర్‌పై తన కొడుకుతోపాటు హొన్నాజిపేట్ ఊర్లోకి వెళ్లి వంట సామాగ్రి కోసం వెళ్లాడు. సరుకులు తీసుకుని వస్తున్న సమయంలో మూలమలుపు వద్ద ట్రాక్టర్‌పై నుంచి ఒక్కసారిగా కిందపడ్డాడు. ట్రాక్టర్ టైర్ ఆయనపైకి ఎక్కటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని కొడుకు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బార్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

నిజామాబాద్ డిస్ట్రిక్ట్ అడ్వొకేట్ క్యాలెండర్ ఆవిష్కరణ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రం గణపతి, పట్టణ బార్ ప్రెసిడెంట్ విప్లవ్ కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ వసంత్ రావు,వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రావు షిండే, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బుట్టి మధు,వైస్ ప్రెసిడెంట్ కోనేరు, సొసైటీ డైరెక్టర్ వెంకట రమణ గౌడ్, న్యాయవాదులు కృష్ణం రాజు, ఆయనరి అశోక్, అరుణ్, వేణుగోపీల్ యాదవ్ ,గోపి సాయన్న తదితరులు పాల్గొన్నారు.

జన్ ధన్ యోజన బ్యాంకు ఖాతాలు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకం ద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ ఖాతాలు తెరిపించామని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సంపత్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామస్తులకు ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకం యొక్క ఆవశ్యకతను వివరించారు. దాదాపు ముప్పై మందికి పైగా బ్యాంకు ఖాతాలను తెరిపించామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నాలెడ్జ్ అసైన్మెంట్ టెస్టులో 78 మంది శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కంఠేశ్వర్



జాతీయస్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసైన్‌మెంట్ టెస్ట్ (కాట్) లో నిజామాబాద్ శ్రీ చైతన్యకు చెందిన 78మంది విద్యార్థులు పలు కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థుల అందరిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ మాట్లాడుతూ.. నిజామాబాద్ -1 బ్రాంచ్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జోన్ లోనే అత్యధిక స్కోర్లు సాధించి నగదు పురస్కారాలు, పథకాలు అందుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజినల్ ఇన్చార్జ్ రాజు, కోఆర్డినేటర్ నరేంద్ర, డీన్ వెంకటేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ రాజు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లల సర్వే

నవతెలంగాణ-గాంధారి

బడి బయట పిల్లల సర్వేలో భాగంగా గాంధారి గ్రామపంచాయతీ పరిధిలోని దుర్గానగర్ ఆవాస ప్రాంతంలో తమిళనాడుకు వలస వెళ్లి తిరిగి వచ్చి బడికి దూరంగా ఉంటున్న ముగ్గురు పిల్లలను గుర్తించారు. వీరిని జడ్పీహెచ్ఎస్ గాంధారి పాఠశాలలో సుగుణ, రమ్య ఆరవ తరగతి, మౌనిక తొమ్మిదవ తరగతిలో సీఆర్పీ రాజు చేర్పించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగా వెంకటేశ్వర్‌గౌడ్ వీరికి పాఠశాలలో చేర్చుకొని ఉచిత యూనిఫామ్ అందజేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట ఎస్సీ కాలనీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ప్రత్యేక నిధుల నుంచి రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్టు స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా, బంగారు తెలంగాణ లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుతారి నరేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

● ట్రైనీ కలెక్టర్ శివేంద్రు ప్రసాద్

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎల్లారెడ్డి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ శివేంద్రు ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో 12 వార్డులో కంటి వెలుగు నిర్వహిస్తున్న కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీవన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి : కంటివెలుగును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి ఎంపీడీవో నారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీలతో వారాంతపు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న హరితహారం పనులు, పల్లె పారిశుద్ధ్య పనులపై కార్యదర్శులకు పలు సూచనలను చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం అయ్యేలా చేయాలని, కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ ప్రకాష్, ఉపాధిహామీ అధికారి సక్కుబాయ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్య శిబిరాన్ని పరిశీలించిన మోప్మా పీడీ, రాములు..

రెంజల్ : మండల కేంద్రమైన రెంజల్ రైతు వేదికలు ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని మోప్మా పీడీ రాములు శుక్రవారం పరిశీలించారు. కంటి వెలుగు2 శిబిరంలో ప్రజలు కంటి వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ గౌసుద్దీన్, గ్రామ కార్యదర్శి రాజేందర్‌రావు, తదితరులున్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

ఎడపల్లి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని కంటి పరీక్షలను చేయించుకున్నారు. కేంద్ర ఆవరణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాలను ఆయన ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు.

రెండో రోజు కంటి వెలుగు

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రెండో రోజు 263 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి హిమబిందు తెలిపారు.

ఆడబిడ్డలకు భరోసా.. కల్యాణలక్ష్మి

● స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కోటగిరి

ఆడబిడ్డలకు భరోసా.. కల్యాణలక్ష్మి అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 84 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీపీ సునీత శ్రీనివాసరావు అధ్యక్షతన కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన 84 మంది లబ్ధిదారులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కోటగిరి తహసీల్దార్ శ్రీకాంత్ రావు, పోతంగల్ తహసీల్దార్ రమేష్, బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, కోటగిరి సర్పంచ్ పత్తి లక్ష్మణ్, జెడ్పిటిసి శంకర పటేల్, వైస్ ఎంపీపీ బాల్ థాకరే, మార్కెట్ కమిటీ చైర్మన్ హైమద్, జెడ్పిటిసి, కోఆప్షన్ సిరాజుద్దీన్, మండల రైతు కన్వీనర్ కొల్లూరు కిషోర్ బాబు, కోటగిరి విండో అధ్యక్షులు సిద్ధు, కొత్తపల్లి విండో అధ్యక్షులు డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న స్పీకర్

పసుపు క్వింటాల్‌కు రూ.15వేలు ఇవ్వండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పసుపు క్వింటాలకు రూ.15వేలు మద్దతు ధర ఇవ్వాలని ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకెఎంఎస్) నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అర్సపల్లిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు రైతులకు ఇచ్చిన హామీని విస్మరించాయని, దీని మూలంగా పసుపు మార్కెట్లో ట్రేడర్లు 5,000 రూపాయలకు మించి ధరకు కొనడం లేదని అన్నారు. పంటలకు పెట్టిన పెట్టుబడులు రాక రైతులు నష్టాల్లో కురుకపోతున్నారని అన్నారు. ఎంఎస్పి మద్దతు ధరలను కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మండిపడ్డారు.

ఇతర పంటలకు కల్పించిన మద్దతు ధర పసుపు పంటకు ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. 2018లో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పసుపు పంటకు మద్దతు ధర కల్పిస్తామని, స్వయం సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఎందుకు అమలు చేయ లేదని ప్రశ్నించారు. పసుపును మార్క్ ఫెడ్ సంస్థ ద్వారా క్వింటాలకు 15 వేల రూపాయలకు కొనుగోలు చేయాలని, పసుపు రైతులను ఆదుకోవాలని పసుపు బోర్డునుఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు నాయక్ వాడి నరసయ్య, జిల్లా నాయకులు గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సాయిలు, నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సంతాయిపేటలో జాతర

● ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సంతాయిపేట గ్రామంలోని భీమేశ్వర ఆలయంలో శనివారం మాఘమ అమావాస్యను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతర నిర్వహించనున్నట్లు కమిటీ బృందం శుక్రవారం తెలిపింది.

సంతాయిపేట అందమైన చిన్న గ్రామం. ఊరికి సమీపంలో వెలసిన స్వయంభూ శ్రీ భీమేశ్వరాలయం ఉంది. ఈ దేవస్థానం వద్ద గలగల పారే సెలయేరే పర్యాటక ప్రాంతం. భీముడు ప్రతిష్టించిన శివలింగం ఉందని, వందల ఏండ్ల నాటి చరిత్ర ఉన్న దేవాలయం ఇదని గ్రామస్తులు చెబుతున్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వైపు పారే వాగు మధ్యలో ఈ భీమేశ్వరాలయం ఉంది. అందుకే ఈ వాగును దక్షిణంగా అని కూడా పిలుస్తారు. ఈ భీమేశ్వరాలయానికి పశ్చిమ ముఖద్వారం ఉండడం దేశంలో ఎక్కడా లేని విధంగా భీమేశ్వర ఆలయంలో కుంతీదేవి విగ్రహం ఉండడం వలన సంతాన భాగ్యం లేని వారు కుంతీదేవికి పూజలు చేస్తే సంతానం కలుగుతుందని ప్రజల విశ్వాసం. ఈ ఆలయానికి పక్కన యమకొండ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఎన్నో విశిష్టలు ఉన్న ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘమా అమావాస్య శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శనివారం రోజున నిర్వహించే ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



సంతాయిపేటలోని ఆలయం

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎల్లారెడ్డి డీఎస్పీ

మండలంలోని సంతాయిపేట గ్రామ శివారులో గల భీమేశ్వర ఆలయంలో శనివారం జరిగే జాతర ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన వెంట సదాశివనగర్ సీఐ రామన్, ఎస్ఐ ఆంజనేయులు, సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిలే దీక్షలలో మజ్లిస్ నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ జిల్లా సాధనకై బోధన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలలో మజ్లిస్ నాయకులు బోధన్ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు షేక్ ముషీర్ బాబా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ హాబీబ్ ఖాన్, ఖదీర్, మున్సిపల్ కౌన్సిలర్స్ మొహమ్మద్ వలి ఉద్దీన్, అదిల్ బాబర్, అఖీల్ ఫారూఖీ, షేక్ అల్తాఫ్, సయ్యద్ ఉమర్, షేక్ సమీర్, ఖిజర్ సోహేల్, షేక్ రాషద్, నవీద్ రజ, అలీం రజా, షేక్ ఆరిఫ్ పాషా, ఆరీఫ్ ఉద్దీన్ వసీం, ముస్తాక్ హుస్సేన్, మొహమ్మద్ ఉమర్, రేహమత్ ఖాన్ దీక్షలలో కూర్చున్నారు. శుక్రవారం నాటికి ఈ దీక్షలు 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు బోధన్ ఎంఐఎం పార్టీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్‌లు పాల్గొని బోధన్ జిల్లా ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించారు.

మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-జుక్కల్



మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా శ్రావణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ.. మండల వాసులకు నిత్యం అందుబాటులో ఉండి, సేవలందిస్తానని పేర్కొన్నారు.

కల్యాణ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్

కల్యాణలక్ష్మీ చెక్కులను జుక్కల్ ఎమ్మెలే హన్మంత్ షిండే శుక్రవారం పంపిణీ చేసినట్టు సావర్‌గావ్ సర్పంచ్ కిషన్ పోవార్ తెలిపారు. ఈ సందర్భంగా కిషన్ పోవార్ మాట్లాడుతూ.. సావర్‌గావ్ జీపీకి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులను అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్, జాగృతి నియోజకవర్గ కన్వీనర్ అనితా సింగ్, నీలుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-లింగంపేట్

తెలంగాణ రాష్ట్రంలోని 18 లక్షలకుపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలను డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. లింగంపేట్ మండలంలోని బీజేవైఎం కార్యకర్తలకు చేరుకొని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్స్ వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దత్తు రాములు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు మహారాజు, మురళి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బొల్లారం సాయిలు, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాసరి అనిల్ నాయకులు పాల్గొన్నారు.

డ్రోన్‌స్ప్రేయర్‌తో పిచికారీ సులువు

నవతెలంగాణ-రాజంపేట్

డ్రోన్‌స్ప్రెయర్‌తో పిచికారీ సులువని ఏపీఎం సాయిలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం డ్రోన్ స్ప్రేర్ గురించి దాని ఉపయోగాల గురించి వివరించారు. పంట పొలాలకు రసాయనిక మందులు స్ప్రే చేయడానికి ఒక ఎకరానికి రూ.600 నిర్ణయించినట్టు అన్నారు. రాజంపేట మండల పరిధిలోని గ్రామ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఎంపీపీ లింగాల స్వరూప, డ్రోన్ స్ప్రెయర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నల్లవెల్లి అశోక్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారిని ఏడీకే అపర్ణ, మండల సమైక్య కోశాధికారి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు దేవవ్వ, ఏపీఎం సాయిలు, సీసీలు శ్రీనివాస్, భాగయ్య, రమేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖండ్‌గాం సర్పంచ్‌కు ఐదేండ్ల జైలుశిక్ష

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఖండ్‌గాం సర్పంచ్ హల్దే లాలుకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం బోధన్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ దేవాన్ అజయ్ కుమార్ తీర్పు వెల్లడించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అమావాస్య పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ వేణు తెలిపారు. శుక్రవారం ఆలయ సిబ్బంది, ఆలయ చైర్మన్ పురం సాయిలు, రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, ఆలయ ధర్మకర్త మండలితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. శనివారం అమావాస్య సందర్భంగా అష్టముఖి కోనేరులో సుమారు 30 వేల పైచిలుకు భక్తులు స్నానమాచరించనున్నట్లు ఆలయ ఈఓ వేణు అన్నారు.

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలి

నవతెలంగాణ-ఎడపల్లి

ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు బిల్లా రామ్మోహన్ మాట్లాడారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని హామీనిచ్చి మరిచారని అన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని, పట్టాల పంపిణీ చేయాలని చేశారు. అనంతరం తహసీల్దార్ ఆకుల శేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎడపల్లి మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గైనీ పోచయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళలు ఉన్నారు.

వరి పంట క్షేత్ర ప్రదర్శన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా క్యాంపులో రైతు దాసు పొలంలో ఎఫ్ఎంసీ ఏరియా మేనేజర్ అనిల్‌కుమార్ క్షేత్ర ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజశేఖర్, సెల్స్ ఆఫీసర్ సాయిప్రసాద్, కంపెనీ ప్రతినిధులు మనీష్, రమేష్, మహేష్, రైతులు ఎమ్మెల్ రాజు, రామారావు, దాసు, 30 మంది రైతులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ సంపూర్ణంగా అమలు చేయాలి

నవతెలంగాణ-తాడ్వాయి

ఉచిత విద్యుత్ సంపూర్ణంగా అమలు చేయాలని టీఆర్ఆర్ఎస్ (తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి) కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మచ్చర్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రజక కులవృత్తిదారులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తున్నా.. ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. రజక వృత్తిదారులపై విద్యుత్ చార్జీల బిల్లులు రావడంతో వృత్తిదారులు అయోమయంలో పడుతున్నారని, అంతేకాకుండా విద్యుత్ ను ఉపయోగించకుండా కొందరు మళ్ళీ బొగ్గులతో ఇస్త్రీ చేస్తున్నారని వాపోయారు. కావున సంపూర్ణమైన ఉచిత విద్యుత్‌ను అమలుచేసి వారికి అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు దేమె అనిల్ కుమార్, జిల్లా సీనియర్ నాయకులు కంస్కల్ బాల్‌రాజు, జిల్లా కార్యదర్శి సాయిలు, లక్ష్మణ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో గ్రామసభ

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సర్పంచ్ గుడ్డల సత్యనారాయణ అధ్యక్షతన 2022-23 ఏడాదికి సంబంధించిన అభివృద్ధి పనులపై గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, విధి దీపాలు, అవెన్యూ ప్లాంటేషన్, హరితహారం మొక్కల సంరక్షణ, వాటి ఎదుగుదలకు నీటి సౌకర్యాలను, గ్రామ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా భగీరథ నీరు వచ్చేలా చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. ఈ సభలో గ్రామ ప్రజలు తమ వాడల్లో మిగిలిన పనులను కొనసాగించాలని సర్పంచ్ దృష్టికి తేవడంతో ఆ పనులను జీపీడీపీ వాట్‌లో నమోదు చేసి పనులను పూర్తిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్విని సాయిలు, పంచాయతీ కార్యదర్శి రాంచందర్, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

● బీజేవైఎం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ దిష్టిబొమ్మను ఎల్లారెడ్డిలో అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేవైఎం ఎల్లారెడ్డి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. అలాగే రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బీజేవైఎం మండల అధ్యక్షులు నరేష్ పీకే, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కుచులకంటి శంకర్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని, దాదాపు 18 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వెంటనే వారి ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యావత్ విద్యార్థి లోకం ముక్తకంఠంతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి సమాధానం చెప్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు జీవన్, సాయికిరణ్ యాదవ్, ప్రశాంత్, బీజేవైఎం నాయకులు తలారి సతీష్, రాజు, ప్రణీత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా, గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

నవతెలంగాణ-రాజంపేట్

నాటుసారా, గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దోమకొండ ఎక్సైజ్ సీఐ పోతారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌ఓ దోమకొండ, డీటీఎఫ్ కామారెడ్డి, ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిజామాబాద్ టీమ్స్, ఆధ్వర్యంలో శుక్రవారం దోమకొండ స్టేషన్ పరిధిలోని రాజంపేట మండలంలోని షేర్ శంకర్ తండా, ముదుమలిల తండా, ఎల్లారెడ్డి పల్లె తండా, లేత మామిడి తండా, గుడి తండాలలో నాటుసారా, గంజాయిపై జాయింట్ రైడ్ నిర్వహించారు. తదుపరి సిద్ధాపూర్ నుంచి మెదక్ రోడ్ నందు ఇతర రాష్ట్రాల మధ్యము, ఎక్సైజ్ నేరాల నిమిత్తం రూట్ వాచ్ నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం గ్రామాల్లో రైతులకు నాటు సారా, గంజాయిపై అవగాహన కల్పించారు.

బాజిరెడ్డిని కలిసిన ఎంపీపీలు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



టీఎస్‌ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్దన్ ను నిజామాబాద్ మండలం ఎంపీపీ బానోత్ అనూష ప్రేమ్ నాయక్ మోపాల్ జడ్పిటిసి బానోత్ కమల నరేష్ నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. మండలాల అభివృద్ధికి వినతి పత్రాలను అందజేశారు. రెండు మండలాలు నిజామాబాద్ లో నగరంలో ఉన్న ఏడీఈ పరిధిలో ఉంచాలని విన్నవించారు. ఆయన స్పందించి ఎన్పీడీసీఎల్ సీఎండీకి లేఖ రాశారని తెలిపారు.

సురక్ష మహా లాగిన్ డే ర్యాలీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిరాయత్ నగర్ సబ్ పోస్ట్ ఆఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం బీపీఎంలు, ఏబీపిఎంలతో సురక్ష మహా లాగిన్ డే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 18 నుంచి మూడురోజులు డైరెక్టరేట్ న్యూఢిల్లీ వారి ఆదేశానుసారంగా యాక్సిడెంట్ పాలసీలు, హెల్త్ అండ్ మోటార్ ఇన్సూరెన్స్ పాలసీలు, బీపీఎంలు, ఏబీపీఎమ్ చేసినట్టు జిరాయత్‌నగర్ సబ్ పోస్టాఫీస్ ఎస్పీఎం ఆంజనేయులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రెండు రోజులు టాటాబజాజ్ పాలసీలు చేయాలని కోరారు. బీవో పరిధిలోని బీపీఎంలు, ఏబీపీఎంలు చేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లా ఎస్ఎస్పిఎం అధికారులు, ఏఎస్పీల ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంటి వెలుగు శిబిరాలను సందర్శించిన కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దృష్టి లోపాలను దూరం చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం సందర్శించారు. మండల కేంద్రమైన నవీపేట్ తో పాటు అదే మండలంలోని అభంగపట్నంలో కొనసాగుతున్న కేంద్రాలలో కంటి శిబిరాల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, వారి ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. శిబిరాల వద్ద సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. రోజుకు సగటున ఎంత మంది నేత్ర పరీక్షల కోసం వస్తున్నారు.. ఎక్కువగా ఏ వయస్సు వారు ఉంటున్నారని కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిబిరాలకు వచ్చే వారికి మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. క్యాటరాక్ట్ సర్జరీ అవసరం ఉన్న వారి వివరాలను ప్రత్యేక రిజిస్టర్లో పొందుపర్చాలని, వారిని నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. కంటి జబ్బులకు సంబంధించిన అన్ని రకాల చికిత్సలను కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అందించడం జరుగుతోందన్నారు. అవసరమైన వారికి శిబిరాల్లోనే ఉచితంగా మందులు, రీడింగ్ అద్దాలు అందిస్తున్నారని అన్నారు. ప్రిస్క్రిప్షన్ గ్లాసెస్ అవసరం ఉన్న వారికి 15 నుండి 20 రోజుల్లోపు వాటిని వారి ఇళ్లకు చేర్చేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 70 బృందాలు కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నాయని, వీటిలో రూరల్ ఏరియాల్లో 48 బృందాలు, పట్టణ ప్రాంతాల్లో 22 బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు శిబిరాలకు వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలని, ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పించి శిబిరాలకు తరలి వచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కలెక్టర్ కోరారు. శిబిరాల విజయవంతానికి పంచాయతీ రాజ్, మున్సిపల్, ఐ కే పీ, మెప్మా, ఐసీడీఎస్ తదితర శాఖలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.

మన ఊరు - మన బడి పనులు తనిఖీ

నవీపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు -మన బడి కింద చేపట్టిన పనులను కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. తుది దశ పనులను కూడా నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణను చక్కగా చదును చేసి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. విద్యార్థుల కోసం వండిన మధ్యాన్న భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ సాజిద్ అలీ, తహసీల్దార్ వీర్ సింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



కంటిశిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఐదు రోజులు బ్యాంకులు బంద్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షన్ అప్డేట్, నేషనల్ పెన్షన్ సిస్టమ్ రద్దు, వేతన సవరణ డిమాండ్ల కోసం జనవరి 30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయనున్నారు. దీంతో ఈరెండు రోజులు బ్యాంకులు మూతపడే అవకాశం ఉంది. ఈనెల 26న రిపబ్లిక్ డే, 28న నాలుగో శనివారం, 29న ఆదివారం ఉండటంతో ఆ రోజుల్లో కూడా బ్యాంకులు తెరుచుకోవు. 26 నుంచి 31 మధ్య కేవలం 27న మాత్రమే బ్యాంక్స్ ఓపెన్ ఉంటాయి అని తెలిపారు.

22న ఉచిత గుండె వైద్య శిబిరం

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

వచ్చే ఆదివారం పది గంటల నుండి రెండు గంటల వరకు కమ్యూనిటీ హాల్ గంగాస్థాన్ ఫేస్-1లో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ కూరపాటి కళ్యాణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్ పరీక్ష, హెచ్‌బీఏ-1సి పరీక్ష ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. బీపీ, షుగర్ ఉన్నవారికి ఈసీజీ పరీక్ష, ఛాతీలో నొప్పి, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరిగినట్లు అనిపించడం, గుండె సంబంధిత వ్యాధులున్నవారు. హై బ్లడ్ ప్రెషర్ ఉన్నవారు, షుగర్ ఉన్నవారు, థైరాయిడ్ సమస్యలు గలవారు సంప్రదించవచ్చని తెలిపారు.

చోరీకేసులో వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఓ ట్రాన్స్ పోర్ట్ షాపులో ఇటీవల జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు శుక్రవారం తెలిపారు. షాపులోని సి సి టీవీ ఫుటేజీని పరిశీలించారు. అనంతరం నిందితుడు మహేష్ ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. షాపులో రూ.20వేల వరకు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో నగరంలోనే రూ.10లక్షలు చోరీ చేసిన కేసులో మహేష్ నిందితుడని పోలీసువర్గాల ద్వారా తెలిసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడు మహేష్‌పై అన్ని పోలీస్ స్టేషన్లో వివరాలు తెలుసుకుంటున్నట్టు సమాచారం.

రాష్ట్రస్థాయి ప్రతిభా పాఠవ పరీక్షలో విజయ్ విద్యార్థి

నవతెలంగాణ-కంఠేశ్వర్



విద్యార్థులను అభినందిస్తున్న అమృతలత

రాష్ట్రస్థాయి ప్రతిభా పాఠవ పరీక్షలో విజయ్ హైస్కూల్ విద్యార్థి సహర్ష్ రెడ్డి తృతీయ బహుమతిగా మొమెంటో, ప్రశంసా పత్రం సాధించాడని కరస్పాండెంట్ ప్రభాదేవి శుక్రవారం తెలిపారు. 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పాఠవ పరీక్ష తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం (టి ఎస్ ఎస్ టి ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 19న జడ్పీహెచ్ఎస్ హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో నిర్వహించారు. పాఠశాల కార్యదర్శి అమృతలత, కరస్పాండెంట్ వి. ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి. సుజాత, ప్రిన్సిపాల్ పి. విజేత అభినందించారు.

అసోసియేషన్ అభ్యున్నతికి కృషి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హోల్ సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అభ్యున్నతే ధ్యేయంగా కృషి చేస్తామని ఎన్నికైన నూతన కార్యవర్గం తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని పూసల గల్లీలో గల క్లాత్ భవన్‌లో హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. గణేష్, భూమేశ్వర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ.. మొత్తం 96మంది ఓటర్లు ఉండగా పోటీలో రెండు ప్యానళ్లు బరిలో ఉన్నారన్నారు. నూతన కార్యవర్గం కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందని వెల్లడించారు. అధ్యక్షులుగా కన్నా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బాలే మురళి, కోశాధికారిగా కన్నరాజు, ఉపాధ్యక్షులుగా గూడూరి నవీన్ కుమార్ చింతల బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా కన్నా మధు, చిలుక జగదీశ్వర్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. క్లాత్ భవన్‌కు అనుబంధ సంస్థ అయిన వర్ని రోడ్డు పద్మశాలీ ఉన్నత పాఠశాల నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నట్టు తెలిపారు. అధ్యక్షులుగా చేర్యాల విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా చిలుక వెంకటేశం, కోశాధికారిగా బిర్రు రాధాకృష్ణ, ఉపాధ్యక్షులుగా అవధూత విట్టల్, దుందిగళ్ళ వెంకటేశం. లను ఎన్నుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో హోల్ సేల్ క్లాత్ భవన్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గం

ఏసీడీ చార్జీలు ఉపసంహరించండి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యుత్ వినియోగదారులకు ఏసీడీ చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ సౌద ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఈ రవీందర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.ఓమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సవరణ చట్టం అమల్లో భాగంగా గృహ వినియోగదారుల మీద ఏసిడి చార్జీల పేరుతో అదనంగా విద్యుత్ చార్జీలతో పాటు వెయ్యి నుండి మూడున్నర వేల వరకు చార్జీలను వసూలు చేస్తున్నారన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్ నియంత్రణ మండలి డిస్కొంట్‌లో ప్రతినెల యూనిట్ కు 30 పైసలు వరకు చార్జీలు పెంచుకోవచ్చని అనుమతి ఇవ్వడం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. విద్యుత్ సవరణ చార్జీలను ఉపసంహరించుకోకపోతే గతంలో కరెంటు పోరాటం తరహాలో మరో ప్రజా పోరాటం రాక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికే ఏసీడీ చార్జీలను చెల్లించారో వారికి రాబోయే నెలలో విద్యుత్ వినియోగం బిల్లును మినహాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అడ్డుకే రాజేశ్వర్, పి హనుమాన్లు, రమేష్, ముత్యాలు, గంగాసాగర్, గంగన్న, రఘురాం నాయక్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన జీఓను విడుదల చేయాలి

నవతెలంగాణ-ధర్పల్లి

మధ్యాహ్న భోజన ఏజన్సీ నిర్వాహకులకు ముఖ్యమంత్రి కేసీఆర్, గత సంవత్సరం అసెంబ్లీ సాక్షిగా రెండువేల వేతనం పెంచుతున్నట్లు ప్రకటించి జీఓ విడుదల చేయలేదని, ప్రభుత్వం వెంటనే పెంచిన జీతం 2వేలు కార్మికులకు అందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మధ్యాహ్న భోజన ఏజన్సీ నిర్వాహకులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి ఆధ్వర్యంలో తహశీల్దార్ గంగ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోడిగుడ్డు ప్రభుత్వమే సప్లై చేయాలని, పదేండ్లకింద ఇచ్చిన వంటపాత్రలు చెడిపోయాయని, వంట పాత్రలు మంజూరు చేయాలని కోరినా పట్టించుకోవడంలేదన్నారు. వీరిని కార్మికులుగా గుర్తించి ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా, సామాజిక బీమా ఇవ్వాలని ఉచితంగా గ్యాస్ సప్లై చేయాలని అదేవిధంగా నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేకపోతే రాబోయే కాలంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాము. కార్యక్రమంలో శారద, సునీత, రాజమణి, లత, కార్మికులు పాల్గొన్నారు.



వినతిపరతం అందజేస్తున్న ఏజెన్సీ కార్మికులు

వన్య ప్రాణుల మాంసం విక్రయాలు నిషేధించాలి

నవతెలంగాణ-నందిపేట్



మందుస్తు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

మండలకేంద్రంతో పాటు సరిహద్దులో ఉన్న హోటళ్లలో అడవి జంతువుల మాంసం విక్రయం నిషేధించాలని పోలీసులతో పాటు స్త్రైక్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం హోటల్ యజమానులకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ మాట్లాడుతూ.....డీఎఫ్ఓ ఆదేశాల మేరకు హోటళ్లలో వన్యప్రాణుల మాంసాన్ని కచ్చితంగా నిషేధించాలన్నారు. లేకుంటే 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం డిఫాల్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లు సీజ్ చేసి ఏడేళ్ల పాటు కఠినగరా శిక్షతో పాటు రూ. మూడు లక్షల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

నేడు చిత్రలేఖనం పోటీలు

నవతెలంగాణ-ఆర్మూర్

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో చిత్ర లేఖనం(పెంటింగ్) పోటీలు నేడు క్షత్రియ విద్యా సంస్థల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ప్రోత్సాహం ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. క్షత్రియ జూనియర్ కాలేజ్, చేపూర్ శ్రీ భాషిత గ్రామర్ హై స్కూల్, విద్యానగర్, మాక్లూర్ మండలంలోని కల్లెడ హై స్కూల్, నందిపేట్ మండలంలోని నవోదయ స్కూల్ పట్టణంలోని పిప్రీ ఉన్నత పాఠశాలలకు చేరుకోవాలని తెలిపారు.

లయన్స్ క్లబ్ సభ్యులకు అవార్డులు



అవార్డులు పొందిన లయన్స్‌క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్, బాల్కొండ లయన్స్ క్లబ్ సభ్యులు పలు అవార్డులు సొంతం చేసుకున్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని సాగర్ కన్వర్షన్ హాల్‌లో నిర్వహించారు. రాష్ట్రస్థాయి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ మీట్ కార్యక్రమంలో ముప్కాల్, బాల్కొండ లయన్స్ క్లబ్ సభ్యులు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఏరియా లీడర్ జి.బాబురావ్ చేతులమీదుగా అవార్డులను అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ సేవలను ప్రతి గ్రామాన అందజేస్తున్నామన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, అనాథ పిల్లలను, నిరాశ్రయులను లయన్స్ క్లబ్ సేవల ద్వారా ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. పల్లెల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ సేవలు విస్తృతపరుస్తున్నట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో ముప్కాల్, బాల్కొండ లయన్స్ క్లబ్ సభ్యులు మెడికల్ విక్రమ్, నవీన్, కనకయ్య, దత్తాద్రి, మునిరోద్దీన్, వెంగయ్య, చాకు లింగం, పెండెం జీవన్, జక్కుల రాము, దినేష్, రత్నాకర్ మొదలగునవారు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు పట్ల హర్షం



రోడ్డుపనులు పరిశీలిస్తున్న సర్పంచ్‌లు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి కమాన్ నుండి దేగం గ్రామం వరకు బిటి రోడ్డును ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి సహకారంతో మంజూరు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. నాణ్యతగా రోడ్డు వెయ్యాలని పిప్రి సర్పంచ్ అసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, మంథిని సర్పంచ్ పుట్టింటి లింబా రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.

పెండ్లి కానుకగా 5000 పంపిణీ

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో విజయ డైరీ ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ మగ్గరి హన్మాన్లు చేతుల మీదుగా విజయ డైరీ పాల ఉత్పత్తిదారులు ఇద్దరు పాడి రైతులకు ఐదువేల రూపాయల చెక్కులను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ డైరీలో పాలు పోసే పాలఉత్పత్తిదారులకు పెళ్లి కానుకగా 5000 రూపాయలు అందించడం అభినందనీయమని అన్నారు. పాల ఉత్పత్తిదారులు తమ పిల్లల పెళ్లి పత్రికతో దరఖాస్తు చేసుకుంటే కానుకను ఇవ్వడం జరుగుతుందని నాళేశ్వర్ గ్రామానికి చెందిన మైస సునీత, ముప్పాటి పోసానిలకు ఐదువేల రూపాయల చెక్కులను అందించారు. కార్యక్రమంలో విజయ డైరీ సూపర్వైజర్ ప్రవీణ్ ఉన్నారు.



పెళ్లికానుక చెక్కులు అందజేస్తున్న విజయడైరీ వారు

నివాసపు గుడిసెలు దగ్ధం

- సుమారుగా 9 లక్షలు ఆస్తి నష్టం

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని కొండాపూర్ గ్రామ పరిధిలోని సర్పంచ్ తండా గ్రామపంచాయతీలో శుక్రవారం నివాసపు గుడిసెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధం అయ్యాయని తహసీల్దార్ గఫ్ఫార్ మియ తెలిపారు. సర్పంచ్ తాండా గ్రామపంచాయతీ లో నివాసం ఉంటున్న కేతావత్ బన్నాజీ, కేతావత్ మైపాల్, కేతావత్ రవి గతంలో వేరే తాండాలో ఉండేవారు. అక్కడ తండావాసులతో గొడవలు జరిగి సర్పంచ్ తాండాలో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు. ఇందులో ఇద్దరు విదేశాలకు వెళ్ళడానికి డబ్బులు తెచ్చిపెట్టుకున్నారు. డబ్బులతో పాటుగా పాస్‌పోర్ట్, ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, బట్టలు, సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు ఫైర్ స్టేషన్ కి కాల్ చేయడంతో ఫైర్ ఇంజన్ వచ్చేపాటికి పూర్తిగా కాలి బూడిద అయ్యాయి. అంతా నష్టపోయామని బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, పంచనామా నిర్వహించి నివేదికను పై అధికారులకు అందజేసినట్లు తెలిపారు. వారిని సర్పంచ్, గ్రామ ప్రజలు వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.